వరంగల్ వాయిస్
Evening Daily
www.warangalvoice.net
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 109 | బుధవారం | 25 అక్టోబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5




## ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలి

సీపీ అంబర్ కిషోర్ ఝా

వివిధ పోలీస్ స్టేషన్లలో ఆకస్మిక తనిఖీ

8లో..

# సహకరించం పో!

## తూర్పు బీజేపీలో బీసీ లీడర్ల అసంతృప్తి



వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధి బీజేపీ నేతల్లో అసంతృప్తి సెగలు కక్కుతోంది. మొదటినుంచి పార్టీ కోసం పని చేసి టికెట్ ఆశించిన వారిని కాదని వలస వచ్చిన వారికి టికెట్ కేటాయించడంపై రగిలిపోతున్నారు. బీసీలకు పెద్ద పీట వేస్తున్నామంటూ ప్రకటించుకుంటున్న భారతీయ జనతా పార్టీ పెద్దలు గ్రేటర్ వరంగల్ పరిధిలోని రెండు అసెంబ్లీ స్థానాలను ఓసీలకు కేటాయించడంపై మండిపడుతున్నారు. బీజేపీ సిద్ధాంతాలను నమ్ముకొని మొదటి నుంచి పార్టీ కోసం పనిచేసిన హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మకు వరంగల్ పశ్చిమ టికెట్ కేటాయించడంలో న్యాయం ఉన్నప్పటికీ వరంగల్ తూర్పు టికెట్ బీసీలకు కేటాయించాల్సి ఉందన్న వాదన వినిపిస్తుంది. పార్టీలో ఎంతోమంది బీసీ నేతలున్నప్పటికీ ఓసీలకే పెద్ద పీట వేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. బీసీలు పార్టీ జెండాలు మోసేందుకే పరిమితం కావాలా అంటూ ప్రశ్నిస్తున్నారు. ప్యారాచూట్ నేతలకే పదవులివ్వడంపై ఆగ్రహంతో ఊగిపోతున్నారు. ఇలా అయితే సహకరించేది లేదంటూ తెగేసి చెబుతున్నారు. దీంతో బీజేపీ అధిష్ఠానంలో పునరాలోచనలో పడినట్లు సమాచారం.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి

వివరాలు 2లో..

| | | | | |
|---|---|---|---|---|
| ప్యారాచూట్ నేతలకే పదవులా..? | టికెట్ కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వడం లేదని మండిపాటు | జెండాలు మోసేందుకే పరిమితం చేస్తారా అంటూ ఆగ్రహం | ఇట్లయితే సహకరించేది లేదంటూ హెచ్చరిక | పునరాలోచనలో అధిష్ఠానం |



## మురుగు.. మూడు రోజులు
## పట్టించుకోని బల్దియా

నగరంలోని ప్రధాన రహదారిపై మురుగు కాలువ పొంగి పొర్లుతోంది. వరంగల్ చౌరస్తా నుంచి స్టేషన్ రోడ్డులో గత మూడు రోజులుగా మురుగు నీరు ఉప్పొంగుతూ రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. దీంతో గ్రేటర్ వరంగల్ పాలక వర్గాన్ని, అధికారుల తీరును నగర ప్రజలు తారీఫ్ చేస్తున్నారు.

-వరంగల్ వాయిస్, వరంగల్



## విశ్వనాథ కాలనీలో
## చిన్నారుల కిడ్నాప్

వరంగల్ జిల్లా శంభునిపేట విశ్వనాథ కాలనీకి చెందినటువంటి చిన్నారులు ఇద్దరు బుధవారం సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో క్రితం కిడ్నాప్ అయ్యారు. బయట ఆడుకుంటుండగా గుర్తు తెలియని వ్యక్తులు వీరిని కిడ్నాప్ చేసినట్లుగా భావిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 9985574821కు ఫోన్ చేయాలని కోరుతున్నారు. వివారాలు తెలియాల్సి ఉంది.

- వరంగల్ వాయిస్, క్రైం

## కాంగ్రెస్‌తోనే పేదింటి కల సాకారం

మాజీ మంత్రి కొండా సురేఖ

నగరంలోని 36వ డివిజన్‌లో విస్తృత పర్యటన



8లో

వరంగల్ వాయిస్ Evening Daily
బుధవారం 25, అక్టోబర్ 2023
www.warangalvoice.net

# సహకరించం పో!



## తూర్పు బీజేపీలో బీసీ లీడర్ల అసంతృప్తి

### ప్యారాచూట్ నేతలకే పదవులా..?

### టికెట్ కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వడం లేదని మండిపాటు

### జెండాలు మోసేందుకే పరిమితం చేస్తారా అంటూ ఆగ్రహం

### ఇట్లయితే సహకరించేంది లేదంటూ హెచ్చరిక

### పునరాలోచనలో అధిష్ఠానం

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** ఎన్నికలు సమీపిస్తున్న వేళ భారతీయ జనతా పార్టీ నేతల మధ్య విభేదాలు భగ్గుమంటున్నాయి. 52మందితో బీజేపీ ప్రకటించిన తొలి జాబితాలో ప్యారాచూట్ నేతలకే పదవులు కట్టబెట్టడంపై ఆ పార్టీలోని సీనియర్ నేతలు, కార్యకర్తలు మండిపడుతున్నారు. అనేక సంవత్సరాలుగా బీజేపీనే సర్వస్వం అని భావించి ఇంటికి, కుటుంబాలకు దూరంగా ఉంటూ పార్టీ పటిష్ఠానికి పనిచేసిన వారిని పక్కన బెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిద్ధాంతాలనే నమ్ముకొని ప్రాణంకంటే ఎక్కువగా ప్రేమించిన పార్టీ పరులపాలు కావడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. పార్టీ కోసం చావడానికైనా సిద్ధమంటూ ప్రకటించుకున్న నాయకులు, కార్యకర్తలకు కనీస గుర్తింపులేని పరిస్థితి నెలకొనడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ టికెట్ తనకే వస్తుందంటూ సీనియర్ బీసీ నేతలు కుసుమ సతీష్ బాబు, గంట రవికుమార్, వన్నాల వెంకటరమణ, అల్లం నాగరాజు, సిద్ధం నరేష్ ఎంతో ఆశగా ఎదురు చూశారు. ఈ మేరకు నిత్యం నియోజకవర్గంలో పర్యటిస్తూ, స్థానిక సమస్యల పరిష్కారానికి ఎన్నలేని కృషి చేశారు. అంతే కాకుండా పార్టీ ఆదేశాల మేరకు తూర్పులో విస్తృతంగా సమావేశాలు నిర్వహించి పార్టీ పటిష్ఠతకు కృషి చేశారు. పశ్చిమ టికెట్ ఓసీలకు కేటాయించినందున తూర్పు టికెట్ బీసీలకే దక్కుతుందన్న ఆశాభావం వ్యక్తమైంది. దీనికితోడు పద్మశాలి ఓట్లు ఎక్కువగా ఉన్న తూర్పు నియోజకవర్గంలో తప్పక పద్మశాలీలకు టికెట్ ఇస్తే ప్రయోజనం ఉంటుందని అందరూ భావించినప్పటికీ చివరి నిమిషంలో వీరి ఆశలు గల్లంతయ్యాయి.

### వలస పక్షులకే పదవులు..

పార్టీ కోసం పనిచేసిన వారిని కాదని వలస పక్షులకే బీజేపీ అధిష్ఠానం టికెట్లు కేటాయించిందన్న ఆరోపణలున్నాయి. జనగామకు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్‌కు జి.విజయరామారావు, పాలకుర్తిలో లేగ రామ్మోహన్‌రెడ్డి, డోర్నకల్‌కు భూక్యా సంగీత, మహబూబాబాద్‌లో జాటోతు హుస్సేన్ నాయక్, వరంగల్ పశ్చిమలో రావు పద్మ, వరంగల్ తూర్పులో ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, వర్ధన్నపేటకు కొండేటి శ్రీధర్, భూపాలపల్లికి చందుపట్ల కీర్తిరెడ్డి, హుజూరాబాద్‌కు ఈటల రాజేందర్, ఇల్లందుకు రవీంద్రనాయక్, భద్రాచలంలో కుంజా ధర్మరావుకు బీజేపీ అధిష్ఠానం టికెట్లు కేటాయించింది. అయితే బీజేపీ సిద్ధాంతాలను నమ్ముకున్న వారికి కాకుండా ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికే ఎక్కువ స్థానాల్లో అవకాశం ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. వరంగల్ తూర్పు అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఇటీవలే బీజేపీలో చేరారు. పాలకుర్తి బీజేపీ అభ్యర్థి లేగ రామ్మోహన్‌రెడ్డి పెద్దగా ప్రజలకు పరిచయం లేని వ్యక్తి. ఇల్లందు, భద్రాచంలోనూ అభ్యర్థులు ఇలాగే ఉన్నారు. డోర్నకల్ అభ్యర్థి భూక్యా సంగీత వారం క్రితమే బీజేపీలో చేరారు. నర్సంపేట, పరకాల, ములుగు, హుస్నాబాద్, మంథని స్థానాల్లలో అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.

### ప్రదీప్‌రావు సొంత సైన్యం..

మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సోదరుడైన ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఇటీవలనే బీఆర్ ఎస్ ను వీడి బీజేపీలో చేరారు. ఆయన పార్టీలో చేరినప్పటినుంచి వివాదాస్పదుడిగానే వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. తనకంటు ప్రత్యేక సైన్యం ఏర్పాటు చేసుకొని బీజేపీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసిన వారిని పక్కన బెట్టారన్న అపవాదు మూటగట్టుకున్నారు. తూర్పులో పార్టీ పరిస్థితి ప్రశ్నార్థకంగా ఉన్న సమయంలో పార్టీకోసం పనిచేసిన వారిని ఏమాత్రం పట్టించుకోవడంలేదన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఆయన ఏర్పాటు చేసుకున్న ప్రత్యేక సైన్యాన్ని వెంటబెట్టుకొనే పార్టీ కార్యక్రమాలకు హాజరయ్యేవారని వినికిడి. దీంతో బీజేపీకి ఎర్రబెల్లి ప్రదీప్ రావుకు మధ్య గ్యాప్ పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం పార్టీ అంతా ఒకవైపు ఉంటే ఎర్రబెల్లి ప్రదీప్ రావు మాత్రం వేరే వైపు ఉంటూ బీజేపీని తూర్పులో అబాసుపాలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

### బీసీలపై చిన్నచూపా..?

వరంగల్ తూర్పు నియోజకవర్గంతో పాటు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థుల పేర్లను బీజేపీ తొలి జాబితాలోనే ప్రకటించారు. అయితే ఈ రెండు స్థానాల్లో ఓసీలకు అవకాశం కల్పించడంపై పార్టీలో ఉన్న బీసీ నేతలు మండి పడుతున్నారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడడంతోపాటు హనుమకొండ జిల్లా అధ్యక్షురాలిగా ఎనలేని సేవలు అందించిన రావు పద్మకు టికెట్ కేటాయించడాన్ని ఎవ్వరూ తప్పుపట్టడం లేదు. అయితే తూర్పు నియోజకవర్గంలో ప్యారాచూట్ కట్టుకొని వాలిన ఓసి నేతకు టికెట్ కేటాయించడంపై మండిపడుతున్నారు. వరంగల్ జిల్లా పరిధిలో ఎంతో మంది బీసీ నేతలు ఉన్నప్పటికీ వరంగల్ తూర్పు టికెట్ ఓసీలకు ఎలా కేటాయిస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. గత ముప్పై సంవత్సరాలుగా పార్టీకోసం పనిచేసిన వారిని పక్కన బెట్టడంపై పార్టీలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. పార్టీలో కేవలం జెండాలు మోసేందుకే బీసీ నేతలు ఉపయోగపడుతారా అంటున్నారు. ఇట్లయితే పోటీ చేసే అభ్యర్థులకు సహకరించేది లేదంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

### పునరాలోచనలో అధిష్ఠానం..

బీజేపీ టికెట్ కేటాయించిన ఎర్రబెల్లి ప్రదీప్ రావుపై పార్టీ అధిష్ఠానం పునరాలోచనలో పడినట్లు సమాచారం. బీజేపీలోనే ఉంటూ కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం పాకులాడుతున్న ఆయనను పక్కన బెట్టాలన్న పార్టీ సీనియర్ నేతల అభ్యర్థనను అధిష్ఠానం పరిగణలోకి తీసుకున్నట్లు తెలిసింది. బీఆర్ ఎస్ నుంచి ఇటీవలనే బీజేపీలో చేరినప్పటికీ అధిష్ఠానం గుర్తించి టికెట్ ఇచ్చినా ప్రదీప్ రావు పక్కచూపులు చూడడాన్ని పార్టీ సీరియస్ గా తీసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో ఆయనను పక్కన పెట్టే దిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం.

### ఏడుపొస్తుంది..:

**కనుకుంట్ల రంజిత్ కుమార్, బీజేపీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు**



బండి సంజయ్ అధ్యక్ష పదవి మార్చితే చాలా మంది బీజేపీలో చేరటానికి సిద్ధంగా ఉన్నారంటూ పార్టీ అధిష్ఠానానికి పదే పదే చెప్పి నమ్మించిన కాంగ్రెస్ పెద్ద మనుషుల ఆచరణ మేరకు బీజేపీలో చేరి కోవర్టు ఆపరేషన్ పూర్తి అయ్యాక సొంతగూటికి చేరుకుంటున్నారని, ఇందుకు ప్రత్యక్ష సాక్షి మునుగోడు రాజగోపాల్ రెడ్డి అంటూ బీజేపీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ కుమార్ ఆరోపించారు. ఇదంతా పక్కా ప్రణాళిక ప్రకారం బీజేపీని దెబ్బ కొట్టడానికి రచించిన వ్యూహం అన్నారు. ఇంకా కొంతమంది కోవర్టులు బీజేపీలోనే ఉన్నారన్నారు. వారు కూడా త్వరలోనే సొంత గూటికి వెళ్తారన్నారు. అనేక సంవత్సరాలుగా బీజేపీనే సర్వస్వం అని నాలాంటి ఎంతోమంది కార్యకర్తలు కుటుంబానికి ఇవ్వని సమయం పార్టీకి ఇస్తున్నామన్నారు. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకే అవకాశాలు ఇయ్యండి పారాషూట్ వేసుకుని వచ్చే వ్యక్తులను నమ్మకండి అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీలో ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే గుండె ఆగిపోయే పరిస్థితి కనబడుతోంది. కంటినిండ ఏడుపొస్తుంది. నాలాంటి ఎంతోమంది కార్యకర్తల మనసులో ఉన్న బాధ ఇది. చావనైనా చస్తాం కానీ పార్టీ మారం.. తూర్పులో పోటీ చేసే అభ్యర్థిని గెలిపించుకుంటామంటూ రంజిత్ కుమార్ ప్రకటించారు.







## బీఆర్ఎస్‌ను ఓడించడం ఎవరి తరం కాదు

### ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

### గులాబీ కండువా కప్పుకున్న కాంగ్రెస్ పార్టీ 34, 36వ డివిజన్ల అధ్యక్షులు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** సీఎం కేసీఆర్ నాయకత్వంలో వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీ 34వ డివిజన్ అధ్యక్షులు పరిమిల్ల భిక్షపతి, 36 డివిజన్ అధ్యక్షులు ఎస్కె.సోహెల్ బుధవారం ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ మేరకు వారిని ఆయన గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేందర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ను ఓడించడం ఎవరితరం కాదన్నారు. గత పాలకులు వరంగల్ తూర్పు నియోజకవర్గ అభివృద్ధిని వెనుక పడేశారన్నారు. ప్రజల అభివృద్ధికి నియోజకవర్గ అభివృద్ధికి ఏమాత్రం తోడ్పాటునందించలేదని ఆరోపించారు. ప్రజలను అడ్డం పెట్టుకొని వారు వ్యక్తిగతంగా సంపాదించుకున్నారే తప్ప ఏనాడు నియోజకవర్గం బాగు కోరలేదన్నారు. తాను ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఈ ప్రాంత బిడ్డగా ఇక్కడి అవసరాలు తెలిసిన వ్యక్తిగా ఒక నిరుపేదకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే మునుపెన్నడూ చూడని విధంగా వరంగల్ తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపించానన్నారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులుగా ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకులే నేడు ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్ నాయకత్వాన తాను చేస్తున్న అభివృద్ధికి సంపూర్ణ మద్దతు తెలపాలని వారు బీఆర్ఎస్ పార్టీలో చేరడం చాలా సంతోషంగా ఉందన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరినీ కాపాడుకుంటానని, సముచిత స్థానం కల్పించి అండగా ఉంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. వరంగల్ నగరంలో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీ ఇస్తున్న సంక్షేమ ఫలాలు నిరుపేదలకు ఉపయోగకరంగా ఉన్నాయని వరంగల్ జిల్లా కేంద్రం తీసుకురావడం, కలెక్టర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ రూ.1250 కోట్లతో నిర్మించడం, వరంగల్ బస్టాండ్ రోడ్లు డ్రైనేజీ డబుల్ బెడ్ రూములు అనేక సంక్షేమ ఫలాలు ప్రజలకు అందిస్తున్న కేసీఆర్, ఎమ్మెల్యే నరేందర్ చేస్తున్న అభివృద్ధిలో భాగస్వామ్యం అవ్వాలని చేరినట్టు వారు చెప్పారు. ఎమ్మెల్యే నరేందర్ అధిక మెజార్టీతో గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు సోమిశెట్టి ప్రవీణ్, ఎండీ పూర?న్, బీఆర్ఎస్ నాయకులు మర్రి శ్రీనివాస్, దుబ్బ శ్రీనివాస్, శర్పొద్దీన్, బుపాల్ సురేష్, యాకయ్య, అధ్యక్షుడు గుల్బర్ అక్బర్, సురేష్, రాంకీ, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

### సొంత గూటికి బత్తుల కుమార్...

వరంగల్ తూర్పు నియోజకవర్గం 32వ డివిజన్ కు చెందిన కాంగ్రెస్ నాయకులు బత్తుల కుమార్ బుధవారం ఓసీటిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సమక్షంలో సొంతగూటికి చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేందర్ బత్తుల కుమార్ కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ యూత్ నాయకులు సాగర్, రాంకి యాదవ్, రాజుకుమార్ ముఖ్య నాయకులు ఉన్నారు.

### జన చైతన్య యాత్ర ..



తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కారే కావాలి.. సారే రావాలి అనే నినాదంతో బైక్ పై జన చైతన్య యాత్ర నిర్వహిస్తున్న కేసీఆర్ వీరాభిమాని మహేష్(వికలాంగులు) కేసీఆర్, బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి పథకాలను తన బైక్ పై ప్లెక్సీలు ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేస్తున్నారు. అందులో భాగంగా బుధవారం శివనగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో నన్నపునేని నరేందర్ ను కలిసి తన బైక్ యాత్ర గురించి వివరించి అభివృద్ధి పథకాలు, తన యాత్రకు సంబంధించిన కరపత్రాన్ని ఎమ్మెల్యే నరేందర్ కు అందించారు. నియోజకవర్గ వ్యాప్తంగా తన ప్రచారం కొనసాగుతుందని మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేష్ ను అభినందించారు.

## దీపావళి నరకాసురవధకు సహకరిస్తా..



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దీపావళి పండుగ సందర్భంగా జరుగు నరకాసుర వధ ఉత్సవాలకు తగిన ఏర్పాట్లకు తాను శాయశక్తుల కృషి చేస్తానని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హామీ ఇచ్చారు. బుధవారం నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ పక్షాన బోకే అందజేసి వినతి పత్రం ఇచ్చారు. ప్రాచీన సాంప్రదాయాలను నేటి తరానికి తెలియజేయడానికి ఇటువంటి నరకాసుర వధ ఉత్సవాలు ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. ఉత్సవ కమిటీ పక్షాన గ్రౌండ్ లో విద్యుత్ అలంకరణ, బ్యారికేడ్, టెంటు, ఎల్ఈడీ మైక్ సిస్టం, అగ్నిమాపక వాహనం, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయించాలని, రోడ్లు, పారిశుద్ధ్య పనులు, మంచినీటి సౌకర్యాలు కల్పించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉత్సవ కమిటీ కోశాధికారి కనుకుంట్ల రవి, అవునూరి రాంమూర్తి, వనం కుమార్, మరుపల్ల గౌతమ్, మాటేటి శ్యామ్, వంగరి సురేష్, అన్న కుమారస్వామి, కుడికాల సాంబశివరావు, పోలేపాక మల్లేశం, దూడ కొమురెల్లి, తౌటం నరసింహ, కొమ్ము రాజు, పొలం రంజిత్ లు పాల్గొన్నారు.

## నాలుగో బెటాలియన్ కానిస్టేబుల్ మృతి



**వరంగల్ వాయిస్, మామునూర్ :** మామునూర్ నాలుగో బెటాలియన్‌లో (మోటర్ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో) విధులు నిర్వహిస్తున్న 2018 బ్యాచ్ కు చెందిన గూడెల్లి రాజేష్ (పీసీ 493) విధులు నిర్వర్తిస్తూ విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందారు. వివరాల్లోకి వెళితే సోమవారం తెల్లవారుజామున 12-2గంటల మధ్య ఎంటీ వాచ్ డ్యూటీలో ఉన్న రాజేష్ విధులు నిర్వర్తిస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురయ్యాడు. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న తోటి సిబ్బంది గమనించి విద్యుత్ లైన్ ఆపివేసి అంబులెన్స్ లో సీపీఆర్ చేసుకుంటూ వరంగల్ లోని ఎంజీఎం హాస్పిటల్ కి తరలించడం జరిగింది. డాక్టర్లు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు రాయపర్తి మండలానికి చెందిన మైలారానికి చెందిన వాడు కాగా, ఇతడికి భార్య, ఆరు నెలల కుమారుడు ఉన్నాడు. రాజేష్ మృతితో నాలుగో బెటాలియన్, తన స్వగ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

## బీఆర్ఎస్ పార్టీలో చేరికలు



**వరంగల్ వాయిస్, దేవరుప్పుల :** మండలంలోని లక్ష్మణ్ తండా, ఎంసీ తండాలకు చెందిన పలువురు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పాలకుర్తిలో జరిగిన ఒక కార్యక్రమంలో వాళ్లకు గులాబీ కండువాలు కప్పి మంత్రి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో భాస్కర్, లింగ్యా, రెడ్యా, సునీత, విజయ, కవిత, సునీత, సొమ్లా, నాజి, లక్ష్మి, జ్యోతి, సరిత, హెమ్లా చేరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్, జిల్లా నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి, కొడకండ్ల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అనంతోజు క్రిష్ణ మూర్తి, తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మండలంలోని బ్రాహ్మణ కొత్తపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గాదరి బక్కయ్య కుటుంబాన్ని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నబోయిన శ్రీనివాస్, ఎస్సీ సెల్ మండలం అధ్యక్షుడు జెల్ల యాకయ్య, గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పిడుగు రాముతో వెళ్లి పరామర్శించి ఆర్థిక సహాయంగా రూ.5,000 ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో దర్శనం ప్రశాంత్, పెరుమాండ్ల మహేష్, తెప్ప శ్రీకాంత్, వేంకటయ్య, రాములు, గణేష్ సాగర్, ముకేశ్, సంతోష్, మల్లయ్య, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా

## బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రావు పద్మ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ప్రజల ఉద్యమ ఆకాంక్షలు నెరవేరాలంటే రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావాల్సిందేనని బీజేపీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి రావు పద్మ అన్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం బీజేపీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి రావు పద్మ హనుమకొండ సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ లో వాకర్స్ ను కలిసి ప్రచారం నిర్వహించి కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి ప్రధానినరేంద్ర మోడీ మార్గదర్శకత్వంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం, తెలంగాణ రాష్ట్రంలో బీజేపీకి అవకాశం కల్పించి డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటుకు సహకరించాలని వాకర్స్ ను కోరడం జరిగింది. ఈ సందర్భంగా రావు పద్మ మాట్లాడుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో బీజేపీ క్షేత్రస్థాయిలో చాలా బలంగా ఉందని ఈసారి ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యమన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రజలందరి అభివృద్ధి కోసం మౌలిక వసతులు కల్పిస్తూ.. మరోవైపు సంక్షేమ ఫలాలు అందిస్తుంటే కేసీఆర్ మాత్రం కుట్ర రాజకీయాలతో అధికార దుర్వినియోగం చేస్తున్నాడని అన్నారు. కాంగ్రెస్-బీఆర్ఎస్ అంతర్గత ఒప్పందాలతో టికెట్ల పంపిణీ నుంచి గెలిచాక పార్టీ మార్పు వరకు అన్ని అంశాల్లో ముందస్తు అవగాహనతోనే ప్రజల ముందుకు వస్తున్నారని అన్నారు. కాకతీయుల రాజధాని హనుమకొండ నగరాన్ని కబ్జాదారులకు అడ్డాగా మార్చిన ఘనత ఇక్కడి ప్రజాప్రతినిధులదని, బీజేపీ కార్యకర్తలు అందరూ మరింత ఉత్సాహంతో ఎన్నికల సమరంలో పార్టీ గెలుపు కోసం అవిశ్రాంతంగా కృషి చేసి బీజేపీని అధికారం దిశగా నడిపించాలని విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శులు కొలను సంతోష్ రెడ్డి, దేశిని సదానందం గౌడ్, నియోజకవర్గ కన్వీనర్ కందగట్ల సత్యనారయణ, బీజేపీ నాయకులు మట్ట రాజశేఖర్ రెడ్డి, గుజ్జుల మహేందర్ రెడ్డి, కే.విజయలక్ష్మి, మునిగల పద్మ, పుల్యాల రవీందర్ రెడ్డి, పెద్ది మహేందర్ రెడ్డి, చల్లా జైపాల్ రెడ్డి, మందాటి వినోద్, నాను నాయక్, వలబోజు శ్రీనివాస్, నర్మెట్ట శ్రీనివాస్, కురిమిండ్ల సధి, మధుచంద్ర యాదవ్, అనిల్ పాల్గొన్నారు.

## మైనారిటీల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం



**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** ముస్లిం, మైనారిటీల సంక్షేమమే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమని బీఆర్ఎస్ పార్టీ మైనారిటీ సెల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎండీ నయీముద్దీన్ అన్నారు. బుధవారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను ఉర్దూలో ఆవిష్కరించి విడుదల చేశారు. ఈ సందర్భంగా నయీముద్దీన్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ముస్లిం మైనారిటీలకు అండగా నిలుస్తుందన్నారు. ఉర్దూ ఘర్లు, షాదీఖానాలు, మసీదుల నిర్మాణాలతో పాటు, మైనారిటీల గురుకుల పాఠశాలలు, కళాశాలలో ఏర్పాటుచేసి, విద్యాపరంగా పెద్దపీట వేస్తుందన్నారు. లక్ష రూపాయల చెక్కులను, కుట్టు మిషన్లను పంపిణీ చేసి అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. మైనారిటీల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి ఇస్తుందన్నారు. మైనారిటీ మహిళల పెళ్లి కోసం రూ.101,116 ఇస్తూ, షాదీ ముబారక్ చెక్కులను అందిస్తున్న ఘనత, అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం అని అన్నారు. మైనారిటీల బంధుతో పాటు గృహలక్ష్మి పథకంలో కూడా అవకాశం కల్పిస్తున్న సీఎం కేసీఆర్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మైనారిటీ నాయకులు అబ్దుల్ ఖుద్దూస్, బియ బాని, సోనీ, మహమ్మద్, అఫ్జల్, హుస్సేన్, డాక్టర్ అక్బర్, ఇస్మాయిల్, సత్తార్, అంకుషావలి, ఖలీల్, సాదిక్, షౌకాత్, తస్లీమ్, పర్వేన్, యాసిన్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఇంటింటి ప్రచారం



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** మండలంలోని నీరుకుల్ల-పెంచికలపేట గ్రామంలో మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం ఆధ్వర్యంలో బీజేపీ గడపగడపకు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటి ప్రచారంలో బీజేపీ నాయకుడు డా.పగడాల కాళీ ప్రసాద్ రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్ రెడ్డి, బలవంతుల రాజు, ఓబీసీ జిల్లా కార్యదర్శి సముద్రాల రవి, ఎదులాపురం శ్రవణ్ కుమార్, కార్యదర్శులు భయ్యా పైడి ఆచార్య, తిప్పని రాంబాబు, జిట్ట మధు, చేనేత సెల్ కన్వీనర్ కందగట్ల సదానందం, సీనియర్ నాయకులు నాయినేని అమరేశ్వర్ రావు, మాడిశెట్టి రవీందర్, పూజారి సత్యనారాయణ, మల్కంపేట రవి, బూత్ అధ్యక్షులు మంగ మల్లికార్జున్, కొలగని రాజు, కొలగని సుధాకర్, హర్షం అశోక్, బొల్లికొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నేతల మోసపూరిత మాటలు నమ్మొద్దు

**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం, చేయూత ఈ 6గ్యారంటీ స్కీంలను తక్షణమే అమలు చేస్తామని నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. నేడు నాయిని రాజేందర్ రెడ్డి ప్రజా దీవెన యాత్ర లో భాగంగా కాజిపేట 47వ డివిజన్ లో కడిపికొండ ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి ప్రారంభమై, పాపడాల గల్లి, బెల్ట్ ఖాదర్, హరీష్ ముదిరాజ్, పెట్రోల్ బంక్ డీజిల్ కాలనీ, శాంతి నగర్ టెంపుల్, అక్షర స్కూల్, ప్రసాద్ హాస్పిటల్ రోడ్ నెంబర్ సత్య సాయి స్కూల్ పెట్రోల్ బంక్, పోచమ్మ టెంపుల్, గవర్నమెంట్ హై స్కూల్ మీదుగా సాగి బాపూజీ నగర్ చౌరస్తా వద్ద ముగిసింది. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకుల మోసపూరిత మాటలు నమ్మవద్దని, అధికారం కోసం వీరు ఎంతకైనా తెగిస్తారని, తొమ్మిదిన్నర సంవత్సరాలలో చేయని బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు ఏం చేస్తారో ప్రజలు, విద్యావంతులు మేధావులు గమనించాలని నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఇచ్చిన హామీలను పక్కన పెట్టి ఆర్భాటాలు, అబద్ధాలు మాయమాటలతో పరిపాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. వినయ్ భాస్కర్ నువ్వు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాజీపేటకు బస్టాండ్, జూనియర్ కాలేజీ కావాలని కొట్లాడినవు కదా, మరి ఇప్పుడు మీ ప్రభుత్వమే కదా అధికారంలో ఉంది మరి ఎందుకు నువ్వు తేలేక పోయావని ప్రశ్నించారు.



ప్రజలందరూ మోసపూరిత బీఆర్ఎస్ పార్టీకి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పి కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు షేక్ అజగర్, కార్పొరేటర్ పోతుల శ్రీమాన్, టి.మానస, టి.మధు, మహమ్మద్ అంకుష్, ఇప్ప శ్రీకాంత్, గరిగె శివ, బొబ్బిలి నాగరాజు, బాలకృష్ణ, నికుంజన్ , మహమ్మద్ బిలాల్, కిరణ్, హుస్సేన్, బంక సంపత్, అంబేడ్కర్ రాజు, డివిజన్ అధ్యక్షుడు టి.సుధాకర్, పి.ఆంజనేయులు, నాగపురి లలిత, రంగు సుధీర్, ఆరూరి సాంబయ్య, కె.సమ్మయ్య, ఫాన్సీస్ రెడ్డి, సయ్యద్ అఫ్సర్, మహమ్మద్ ఆఫ్జల్, నసీం జహాన్, క్రాంతి భరత్, తాళ్లపల్లి మేరీ, బంక సరళ, గుంటి స్వప్న, పల్లకొండ సతీష్ నాయిని ఉదయ్ రెడ్డి, మేకల ఉపేందర్, నవీద్, గుర్రం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# పాత నేరస్థులపై నిఘా

## ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ ను బుధవారం జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను, రిసెప్షన్ ను పరిశీలించి ఆన్ లైన్ లో పిటిషన్ మేనేజ్ మెంట్ లో ఎంట్రీ చేసిన డాటాను, పిటిషన్ ఫైల్ లో ఉన్న ఎంక్వేరి రిపోర్ట్ ను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ లో నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్ సిడి ఫైల్స్ ను పరిశీలించి,పెండింగ్ లో ఉన్న కేసులను త్వరగా పూర్తిచేయాలని ప్రతి సీడీ ఫైల్ లో ప్లాన్ ఆఫ్ యాక్షన్, క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ గురించి సూచనలు చేశారు. సీసీటీఎన్ఎస్ ప్రాజెక్టులో నమోదు చేస్తున్న ఎఫ్ఐఆర్, సీడీఆర్, పార్ట్ వన్, పార్ట్ టు, డిమాండ్ డైరీ, చార్జిషీట్, ఇంటరాగేషన్ రిపోర్ట్ ను ఆన్ లైన్ లో పరిశీలించారు. టీఎస్ కాప్ డయల్ 100, ఈ పెట్టి కేసులు, ఎఫ్ఆర్ఎస్ తదితర అప్లికేషన్లను, స్టేషన్ రికార్డ్స్ ను పరిశీలించి, వర్టికల్ వారీగా విధులు నిర్వహించడంవల్ల సంబంధించిన వర్టికల్ లో పరిజ్ఞానం పెరిగి రెట్టింపు ఉత్సాహంతో పని చేయడం జరుగుతుందని తెలిపారు. 5ఎస్ విధానాన్ని అమలు పరిచిన తీరును పరిశీలించారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సమస్య పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ నిరంతరం 24%ఇ%7 గస్తీ నిర్వహించాలని సూచించారు. పాత నేరస్థులపై నిఘా పెట్టాలి, రాత్రి వేళలో పెట్రొలింగ్ పెంచి దొంగతనాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. గ్రామ స్థాయిలో ప్రజలతో సత్సంబంధాలు కలిగి యుండి, తరచుగా గ్రామాలను సందర్శిస్తూ, అక్కడి వారి సమస్యలు తెలుసుకుంటూ వారి మౌలిక అవసరాలు పోలీసు శాఖ నుంచి చేయవలసిన సహాయంపై పై అధికారులకు సమాచారం అందజేస్తూ సమాచార సేకరణ చేయాలని తెలిపారు. అలాగే పోలీసు సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని, ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. కమ్యూనిటీ పోలిసింగ్, ఫ్రెండ్లీ పోలిసింగ్ విధానాన్ని అమలు పరచాలని ప్రజలకు ఎప్పుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని అన్నారు. డీఎస్పీ సత్యనారాయణ, రూరల్ సీఐ రమేష్, ఎస్ఐ రామ్ చరణ్ సిబ్బంది పాల్గొన్నారు.

## దసరా ఉత్సవాలలో ఘర్షణ

### బొమ్మ కంటి విజయ్‌పై కర్రలతో దాడి

**వరంగల్ వాయిస్, నడికూడ :** ముస్త్యాలపల్లి గ్రామంలో దసరా ఉత్సవాల సందర్భంగా కొంతమంది వ్యక్తులు గ్రామంలోని ఓ కుటుంబంపై దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పరకాల పోలీస్ స్టేషన్ ఎస్ఐ శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని బొడ్రాయి వద్ద జరిగిన భూ వివాద ఘర్షణలో బోట్ల నరేష్ తండ్రి పాపయ్య వయసు 41సంవత్సరాలు గల వ్యక్తి కుటుంబంపై దాడి చేశారు. అతడిని, అతడి భార్యను, అతని చిన్నమ్మ కుమారుడైన బొమ్మకంటి విజయ్ ను అదే గ్రామానికి చెందిన బొట్ల అరుణ్, బొట్ల రాజు, బొట్ల మదర్, బోట్ల కిరణ్, బోట్ల శ్రీను, బొట్ల భద్రయ్య, బోట్ల కన్నయ్య కర్రలతో తీవ్రంగా గాయపరిచారు. సదరు నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నామని పోలీసులు తెలిపారు.

## మేడిగడ్డ బ్యారేజీపై ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు



**వరంగల్ వాయిస్, పరకాల :** కేసీఆర్ ప్రభుత్వం రూ.1,00,030 కోట్లతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని లక్ష్మీ బ్యారేజ్ మేడిగడ్డ వద్ద పిల్లర్లు కుంగి డ్యామేజ్ అయితే ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా నాయకుడు సాయిలి ప్రభాకర్ ప్రశ్నించారు. దీంట్లో ఉన్న మర్మం ఏంటే చెప్పాలని, నాణ్యత లోపమా, పర్యవేక్షణ లోపమా లేదా ఇంజినీర్ల హక్కులను కాలరాసి ప్రభుత్వం ఇష్టం ఉన్నట్టు కమిషన్ల కోసం ఈ పని చేసిందా అనే అనుమానాలు వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు కట్టిన ప్రాజెక్టులన్ని చెక్కుచెదరకుండా ఉన్నాయని, కేసీఆర్ ప్రభుత్వం ఇటీవల కట్టిన ప్రాజెక్టు కుంగి డ్యామేజ్ అవ్వడం ఏమిటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులు ముందు చూపుతో చేస్తుందని, కానీ కేసీఆర్ ప్రభుత్వం మందు చూపుతో చేస్తుందని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం మౌనం వీడి కేంద్ర విజిలెన్స్ కమిషన్ తో ఎంక్వయిరీ చేసి తక్షణమే బాధ్యులైన ఇంజినీర్లను చర్యలు తీసుకోవాలని, అలాగే అవినీతికి పాల్పడిన ప్రజాప్రతినిధుల ఆస్తులను జప్తు చేయాలని కాంగ్రెస్ పార్టీ తరపున సాయిలి ప్రభాకర్ డిమాండ్ చేశారు.

## బీఆర్ఎస్ పార్టీ గ్రామ ఎన్నికల కన్వీనర్‌గా కుసుమ నరేందర్



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదేశానుసారం భారత రాష్ట్ర సమితి చెన్నారావుపేట గ్రామ ఎన్నికల కన్వీనర్ గా బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు కుసుమ నరేందర్ ను నియమించినట్లు బీఆర్ఎస్ చెన్నారావుపేట మండల ఎన్నికల ఇంచార్జి, ఆర్ఎస్ఎస్ రాష్ట్ర డైరెక్టర్ రాయిడి రవీందర్ రెడ్డి, మండల పార్టీ కన్వీనర్, వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి తెలిపారు. రాబోయే సాధారణ ఎన్నికల్లో భాగంగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నరేందర్ ను చెన్నారావుపేట గ్రామ ఎన్నికల కన్వీనర్ గా నియమిస్తున్నామని అన్నారు. గ్రామ పార్టీ బాధ్యులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకోవాలని వారు సూచించారు.

## కామెంట్ పెడితే కేసులే..

### ఎస్సై ననిగంటి శ్రీకాంత్ రెడ్డి



**వరంగల్ వాయిస్, రేగొండ :** ఎన్నికల వేళ వాట్సాప్ గ్రూప్‌లలో ఒక వర్గాన్ని కించపరుస్తూ మరో వర్గం పోస్టులు, కామెంట్స్ పెడితే చట్టపరంగా కేసులు నమోదు చేయడం జరుగుతుందని స్థానిక ఎస్సై ననిగంటి శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో ఉన్న మాదిరి కేసుల కంటే ఎన్నికల కోడ్ వేళ కేసులు కఠినంగా ఉంటాయనే విషయాన్ని గ్రూపులలో పెట్టే రాజకీయ పార్టీల యువకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఆలోచించి ఎవరిని కించపరిచే విధంగా ఉండకూడదని ఎస్ఐ ఈ సందర్భంగా కోరారు. ఇటీవల నగరంలో కలిసిమెలిసి ఉన్న అన్నదమ్ములు తన అనుకున్న ఎమ్మెల్యేకు సపోర్టుగా పోస్ట్ పెట్టడంతో అన్న ఆ పోస్ట్ తొలగించాలని కోరగా ససేమేర అనడంతో సోదరుడు తన పార్టీ నాయకుడికి తెలపడంతో ఘర్షణలు జరగడంతో కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. పోస్టులు పెట్టే వారు వ్యక్తిగత పార్టీలకు మద్దతుగా, వ్యతిరేకంగా, కించపరిచే విధంగా ఉంటే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై శ్రీకాంత్ రెడ్డి హెచ్చరించారు. గతంలో మాదిరిగా కేసులు నమోదు చేయకుండా ఎన్నికల కోడ్ వేళ ఐటీ చట్టం, ఐపీసీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతున్న దృష్ట్యా ఆయా పార్టీల నాయకులు యువకులు కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి శాంతియుతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించుకోవాలని యువతకు ఎస్సై సూచించారు. ముఖ్యంగా విద్యార్థి యువకులు ఇలాంటి పోస్టులకు గ్రూపులకు దూరంగా ఉండాలని, ఎందులో తలదూర్చిన కేసులు నమోదైతే బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందని ఎస్సై విద్యార్థి యువకులకు ప్రకటన ద్వారా కోరారు.

## ఘర్షణలో ఇరువురికి తీవ్ర గాయాలు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** ఇరువురు వ్యక్తులు ఘర్షణ పడి పరస్పరం దాడి చేసుకోవడంతో తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం రాత్రి మండల కేంద్రంలో జరిగింది. ఎస్ఐ వీరభద్రరావు కథనం ప్రకారం. మండల కేంద్రానికి చెందిన జూలపల్లి దేవేందర్ రావు, జూలపల్లి రవీందర్రావు అన్నదమ్ములు. వీరు ఇరువురుకి ఆస్తి తగాదాలు ఉన్నాయి. పోలీస్ స్టేషన్ తో సహా కోర్టులోను కేసులు నడుస్తున్నాయి. ఈ క్రమంలో సోమవారం రాత్రి రవీందర్ రావు పై దేవేందర్ రావు కొడుకు బుచ్చి రామారావు రాళ్లతో దాడి చేశాడు. పరస్పరం ఇద్దరు గొడవపడి ఘర్షణకు దిగడంతో రవీందర్రావు తలపగిలి తీవ్ర రక్తస్రావం అయింది. వెంటనే స్థానిక ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేయించుకుని మెరుగైన చికిత్స కోసం హనుమకొండలోని ప్రైవేట్ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. రవీందర్ రావు కుమారుడు రాజేష్ కుమార్ ఫిర్యాదు మేరకు బుచ్చి రామారావు అతని కుమారుడు రీతు రావు పై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. ఇది ఇలా ఉండగా దాడిలో బుచ్చి రామారావు కు సైతం తీవ్ర గాయాలు అయ్యాయి. ఆయనను చికిత్స నిమిత్తం హైదరాబాదులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

## పాపయ్యపేటలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని పాపయ్యపేట గ్రామంలో బుధవారం బీఆర్ఎస్ గ్రామ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం మండల కన్వీనర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త పెద్ది సుదర్శన్ రెడ్డి గెలుపు కోసం పనిచేయాలని అన్నారు. ప్రతి కార్యకర్త గ్రామంలో ఉండే ప్రజలకు బీఆర్ఎస్ మేనిఫెస్టోను వివరించాలన్నారు. ఈ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులు పార్టీ ఇంచార్జి రాయుడి రాఘవేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ కంది కృష్ణా రెడ్డి, మండల రైతు కన్వీనర్ బుర్రి తిరుపతి, జిల్లా రైతు సమితి తూటీ శ్రీనివాస్, భద్రు నాయక్, పాపయ్య పేట గ్రామ సుదర్శన్ సత్యం, గ్రామ కార్యకర్తలు పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా దుప్పట్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని సూరిపల్లి గ్రామంలో పల్లపోతుల లక్ష్మీనరసయ్య తల్లిదండ్రులు, పల్ల పోతుల సీతమ్మ మల్లయ్య, బాబాయ్ చిన్నమ్మ, నారాయణ లచ్చమ్మ, అన్నావదినలకు కనుక లక్ష్మి రాజయ్య భార్య పల్లపోతుల భద్రమ్మల జ్ఞాపకార్థంగా బుధవారం సూరిపల్లి గ్రామంలోని నిరుపేదలకు 250 దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నరసయ్య గతంలో మండలంలోని వివిధ పాఠశాలకు బీరువాలు పిల్లలకు ప్యాడ్లు, పెన్నులు, పుస్తకాలు ఉచితంగా అందించారు. అలాగే సూరిపల్లి పరిధిలోని నాలుగు గ్రామాల్లో ఎవరూ చనిపోయిన ఆరోజు వాడే సామాన్లు కూడా నేటి వరకు ఉచితంగా అందిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తోట మహేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్, ప్రజలు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోలు ప్రారంభం



**వరంగల్ వాయిస్, ముల్కనూరు :** ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి, మార్కెటింగ్ సొసైటి లిమిటెడ్ కాటన్ జిన్నింగ్ మిల్లు ఆవరణలో బుధవారం పత్తి కొనుగోలును సంఘం జనరల్ మేనేజర్ యం.రాం రెడ్డి ప్రారంభించారు. పత్తి తేమ 8 నుంచి 12శాతం వరకు, వరంగల్ మార్కెట్ ధరకు లోబడి, నగదు కింద, సభ్యులకు అప్పుల క్రింద ఖరీదు చేస్తామని తెలిపారు. సంఘ కార్యవర్గ సభ్యుడు కూన కనుకయ్య, సంఘసభ్యులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులను పూర్తి చేయాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** అసెంబ్లీ ఎన్నికలలో పోలింగ్ కేంద్రాలలో కనీస మౌలిక సదుపాయాల పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కె.శశాంక అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ తో కలిసి జిల్లాలోని కార్పొరేషన్, వివిధ మండలాల ఎన్నికల ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ నియమ నిబంధనల కనుగుణంగా పోలింగ్ కేంద్రాలలో అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేసి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్తు, సీసీ కెమెరాలు, ఇతర మౌలిక వసతులను త్వరగా పూర్తి చేయాలని, పూర్తయిన పనుల నివేదికను తెలపాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని అన్నారు. పట్టణాలలో అయితే మునిసిపల్ కమిషనర్లు, రూరల్ ప్రాంతాల్లో మండల అభివృద్ధి అధికారులు పనులు పూర్తిచేసేందుకు ఎన్ఆర్ఈజీఎస్, జీపీ నిధుల ద్వారా పనులు పూర్తి చేసి బీఎల్ఓల ద్వారా బీఎల్ఓ యాప్ లో ఈ నెలాఖరులోగా నివేదికలను పొందుపరచాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ రమాదేవి, మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీఓలు ఎల్.అలివేలు, నరసింహా రావు, మునిసిపల్ కమిషనర్లు, విద్యుత్ అధికారులు, పంచాయతీ ఇంజినీరింగ్ అధికారి సురేష్, వివిధ మండలాల అభివృద్ధి అధికారులు, ఎలక్షన్ సూపరింటెండెంట్ పవన్ పాల్గొన్నారు.

## వైభవంగా పద్మాక్షి దేవి శాంతి కళ్యాణ మహోత్సవం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవి శరన్నవరాత్రుల మహోత్సవంలో భాగంగా బుధవారం ఉదయం పద్మాక్షి దేవి శాంతి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. సా 6గంటలకు తెప్పోత్సవం, (పద్మాక్షి తటాకంలో) చేశారు. ఈ మహోత్సవములు నేటితో ముగుస్తున్నాయని, ఉత్సవాలకు సహకరించిన భక్తులకు మహాదాశీర్వచనం దేవాలయ వేద పండితులు షణ్ముఖ పద్మనాభ అవధాని ధన్యవాదాలు తెలిపారు. ప్రతి సంవత్సరం ఈ విధంగా నిర్వహించుకోవాలని దేవాలయ అర్చకులు నాగిళ్ల శంకర్ శర్మ తెలిపారు.

## వాహనాల తనిఖీ



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** రాష్ట్ర శాసనసభ ఎన్నికల సమీపిస్తున్న వేళ బుధవారం నర్సంపేట నెక్కొండ ప్రధాన రహదారి ముగ్ధంపురం దగ్గర ఎస్ఐ తోట మహేందర్ రెడ్డి వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల్లో మద్యం, డబ్బులు, తరలించకుండా ఈ తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడాకారులను సత్కరించిన ఎమ్మెల్యే అరూరి



**వరంగల్ వాయిస్, ఐనవోలు :** మండలంలోని నందనం గ్రామానికి చెందిన యాకర సుప్రియ, యాకర శ్రీనాథ్ లు ఇటీవల హర్యానాలో జరిగిన జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమని బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రీడాకారులను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత మెరుగైన ప్రదర్శన కనబర్చి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

# ప్రజా సమస్యలను మేనిఫెస్టోలో పెట్టాలి



**వరంగల్ వాయిస్, కాటారం:** మంథని నియోజకవర్గంలోని లక్ష ఎకరాలకు సాగునీరు అందించాలంటే కాళేశ్వర ముక్తేశ్వర ఎత్తిపోతల పథకం, చిన్న కాళేశ్వరం దామరకుంట లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, వల్లెంకుంట, కుదురుపల్లి, నాగపల్లి, కుంట్లం, పలిమెల, పోతారం, దేవాదుల ప్రాజెక్టు పైప్ లైన్ బోర్ల గూడెంలో కూడా దగ్గర లింకు ఇవ్వాలి, ఇచ్చంపల్లి సాగునీటి ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని బీజేపీ నేత డాక్టర్ వివేక్ వెంకటస్వామిని ప్రజాసంఘాల నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. కాళేశ్వరం, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ద్వారా ముంపుకు గురవుతున్న గ్రామాల భూములకు నష్టపరిహారం చెల్లించాలి నియోజకవర్గంలో సింగరేణి ఓసీపీ భూములు కోల్పోయిన భూనిర్వాసితులకు బాంబ్ బ్లాసింగ్ ద్వారా దెబ్బతిన్న గృహాలకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులలో నియోజకవర్గ సాగునీటి వాటా ఎంత? అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో నూతన మండలాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అందులో ఒకటి దామరకుంట, బోర్లగూడెం కాళేశ్వరం, గుంజపడుగులోని అన్ని గ్రామాలలో ధోబీ గాడ్స్ నిర్మించాలని, నియోజకవర్గంలో అన్ని గ్రామాలలో గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలన్నారు. మంథని, కాటారం కేంద్రాల్లో 200 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని, కాటారం రెవెన్యూ డివిజన్ పరిధిలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, కాటారంలో బాలబాలికలకు ఎస్ఎంఎస్ హాస్టల్ ఏర్పాటు చేయాలని, కాటారం రెవెన్యూ డివిజన్ లో డిగ్రీ, పీజీ, డైట్ అగ్రికల్చర్ కళాశాలలు ఏర్పాటు చేయాలన్నారు. కాటారం రెవెన్యూ డివిజన్ పరిధిలో బాలబాలికలకు బీసీ గురుకులాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాలభేరి రాష్ట్ర అధ్యక్షుడు పీక కిరణ్, ప్రజాసంఘాల నాయకుడు అక్కల బాబు యాదవ్, సీనియర్ జర్నలిస్ట్ గోగురామస్వామి, గజ్జల రాజు, గుంటి రాములు పాల్గొన్నారు.

## ఎస్బీఐ వరంగల్ రీజినల్ మేనేజర్‌ను కలిసిన ముద్దసాని



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** ఎస్బీఐ బ్యాంకు వరంగల్ రీజినల్ మేనేజర్ అబ్దుల్ రహీం షేక్, క్రెడిట్ సెక్షన్ చీఫ్ మేనేజర్ దుర్గాప్రసాద్ లను చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం వారిని ఆయన కలిసి పూల బొకేలు అందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెన్నారావుపేట సహకార సంఘం స్వల్పకాలిక రుణాల అకౌంట్ రూ.30 కోట్లకు సంబంధించినది ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023-24 రెన్యువల్ చేసినందుకు గాను, అలాగే సకాలంలో అర్హత కలిగిన సభ్యులకు రుణాలు మంజూరు చేసినందుకుగాను ఆయన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## బీఆర్ఎస్‌లోకి చేరికలు



**వరంగల్ వాయిస్, ఐనవోలు :** మండలంలోని కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే 100మంది కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ లో చేరిన వారిలో బీజేపీ మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ అజీమ్, జంపాల సుమన్, హనీఫ్, ఆఫ్రోజ్, పొన్న గోపాల్, తోట రవి, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ శ్రీ మార్నేని రవీందర్ రావ, జడ్పీ వైస్ చైర్మన్ గజ్జల శ్రీ రాములు, జడ్పీ కో ఆప్షన్ సభ్యులు ఉస్మాన్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా పోలింగ్ నిర్వహణకు కార్యాచరణ రూపొందించాలి

### కలెక్టర్, ఎన్నికల అధికారి భవేష్ మిశ్రా



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** జిల్లాలో జరిగే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ పకడ్బందీగా పారదర్శకంగా జరిగేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి భవేష్ మిశ్రా అన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి భవేష్ మిశ్రా పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రాలలో ప్రిసీడింగ్, సహాయ ప్రిసీడింగ్ అధికారులు చేయవలసిన విధులపై సెక్టోరల్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భవేష్ మిశ్రా మాట్లాడుతూ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండటం చాలా కీలకమని, ముఖ్యమైన నిబంధనల పట్ల అవగాహన ఉంటే పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ ఎలాంటి పొరపాట్లు జరగకుండా సజావుగా జరుగుతుందని అన్నారు. పోలింగ్ అధికారులకు ముఖ్యంగా ఈవీఎం యంత్రాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, మాక్ పోల్ నిర్వహణ, ఈవీఎం యంత్రాల పని తీరు, బాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్ల కనెక్షన్లు, వాటి పని తీరు, మరమ్మత్తు జరిగితే తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు. వీవీ ప్యాట్లు ప్రజలకు మరింత భరోసా కలిగించేందుకు భారత ఎన్నికల కమిషన్ 2017 నుంచి వాడకలోకి తీసుకుని వచ్చిందని, ఈవీఎం యంత్రాలకు వివి ప్యాట్ల కనెక్షన్ పకడ్బందీగా చేయాలని, పోలింగ్ కేంద్రంలో ఈవీఎం యంత్రాలను పోలింగ్ కంపార్ట్మెంట్ ఏర్పాటు ఉండేలా చూసుకోవాలని అన్నారు. నామినేషన్ల సమయంలో అభ్యర్థులు నామినేషన్ దరఖాస్తు సమర్పించే సమయంలో అవసరమైన అన్ని రకాల డాక్యుమెంట్లు ఉన్నాయో లేవో రెండు మూడు సార్లు పరిశీలించి రశీదు అందించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్నిక జరిగిన తర్వాత నామినేషన్ లోనే కొన్ని సాంకేతిక అంశాలను చూపుతూ ఎన్నిక చెల్లదంటూ సుప్రీంకోర్టు తీర్పులు ఇస్తున్నాయని ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోని అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాలకు 200మీటర్ల పరిధిలో ఎటువంటి రాజకీయ ప్రచారాలు నిర్వహించడానికి వీలులేదని, 200మీటర్ల పరిధి దాటిన తర్వాత రాజకీయ పార్టీలు 2కుర్చీలు, టేబుల్ వేసుకోవచ్చని, అక్కడ ఉండే ప్రతినిధులకు అయ్యే భోజన ఖర్చు సైతం అభ్యర్థి ఎన్నికల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ఎవరు సెల్ ఫోన్ వాడడానికి వీలులేదని, ప్రిసైడింగ్ అధికారి మైక్రో అబ్జర్వర్లకు మాత్రమే సెల్ఫోన్లు వాడవచ్చని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటరు సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని , పోలింగ్ కు ముందస్తుగా ప్రతి ఓటర్ కు ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయాలని, ఓటర్ సహాయ కేంద్రాల ద్వారా త్వరితగతిన ఓటరు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉపయోగపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, రెవెన్యూ డివిజన్ అధికారి రమాదేవి, నోడల్ అధికారులు, తహసీల్దారులు, సెక్టోరల్ అధికారులు, ఎంపీడీవోలు, మాస్టర్ ట్రైనర్స్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులకు సిబ్బందిని నియమించండి

## జిల్లా కలెక్టర్ కె.శశాంక



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ విధులకు సిబ్బంది నియామక ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.శశాంక తెలిపారు.బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కె.శశాంక, అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ తో కలిసి పోలింగ్ కు ఎన్నికల సిబ్బంది నియామకానికి కసరత్తు విధులను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఉద్యోగ, ఉపాధ్యాయల వివరాల సేకరణ ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల మానవ వనరుల నోడల్ అధికారులు ఇప్పటికే అన్ని శాఖలకు ఉద్యోగ, ఉపాధ్యాయుల వివరాలు ఇవ్వాల్సిందిగా ప్రత్యేకంగా రూపొందించిన నమూనా పత్రం జారీ చేయగా అన్ని విభాగాలలో సమాచార సేకరణ ప్రక్రియతో కూడిన నివేదికను జిల్లా కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో 539పోలింగ్ కేంద్రాలకు గాను 2,156మంది సిబ్బంది అవసరమని అంచనా కావున మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలకు తగ్గట్టుగా ఎన్నికల సిబ్బందిని సమకూర్చుకోవడానికి ఒక్కో పోలింగ్ స్టేషన్‌లో ఒకరు పీవో, ఒకరు ఏపీవో, ఇరువురు పోలింగ్ క్లర్క్‌లు విధులు నిర్వహించే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని, పోలింగ్ కేంద్రాల వారీగా విధుల కేటాయింపు, స్థానికులు, స్థానికేతరులు, సొంత నియోజకవర్గం తదితర వివరాల సేకరణ ప్రక్రియ పూర్తి చేసి ప్రత్యేక ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా చీఫ్ ప్లానింగ్ అధికారి, ఎలక్షన్ మ్యాన్‌పవర్, నోడల్ అధికారి సుబ్బారావు, ట్రైనింగ్ నోడల్ అధికారి సూర్యనారాయణ, ఎలక్షన్ సూపరింటెండెంట్ పవన్, ఎలక్షన్ డీటీలు, ఎన్ఐసీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నేత్ర, అవయవ, శరీరదానంపై అవగాహన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నేత్ర అవయవ శరీర దానంపై అసోసియేషన్ సభ్యులు అవగాహన సదస్సు నిర్వహించారు. సెలవు తర్వాత రోజు కావడంతో తక్కువ మంది విద్యార్థులు ఉన్నందున కళాశాల టీచింగ్ సిబ్బంది, ప్రిన్సిపాల్ కు నేత్ర అవయవ శరీర దానంపై అవగాహన కల్పించారు. సిబ్బంది అవయవ శరీర దానానికి సంసిద్ధతను వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మాత్రం గొప్ప సంకల్పంతో తన మరణానంతరం తన పార్ధేవ దేహాన్ని మెడికల్ విద్యార్థులకు వైద్య విద్య నిమిత్తం శాస్త్ర పరిశోధనకు దేహాన్ని దానం చేస్తానని అంగీకరిస్తూ విల్ ఫామ్ రాసి ఇచ్చారు. వారికి అసోసియేషన్ తరపున హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. అనంతరం డోనర్ కార్డ్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ సిబ్బంది, అసోసియేషన్ అధ్యక్షుడు కొండ్రెడ్డి మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, సలహాదారు రాజేంద్రప్రసాద్, అదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు మోహన్ వారణాసి పాల్గొన్నారు.

## బిషప్ నూతన గృహ ఆహ్వానం



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** మండలం కేంద్రంలోని బిషప్ పొలిమేర జయరాజు నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు సుభాష్ రెడ్డి, సీనియర్ నాయకులు అమరేందర్ రెడ్డి, అమృత రావు, మండల అధ్యక్షుడు ప్రసాద్, పీఏసీఎస్ డైరెక్టర్ లెనిన్, మండల మహిళా అధ్యక్షురాలు యామిని సురేష్, స్థానిక గ్రామ శాఖ అధ్యక్షులు దుర్గయ్య, మాజీ ఎంపీటీసీ రాజకుమార్ లక్ష్మి, యువజన నాయకులు వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌తోనే యువతకు భవిష్యత్తు

## డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్



**వరంగల్ వాయిస్, మరిపెడ :** బీఆర్ఎస్ తోనే యువతకు భవిష్యత్తు ఉందని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. బుధవారం మరిపెడ పట్టణంలో నవీన్ రావు గెస్ట్ హౌజ్ లో పట్టణానికి చెందిన 300మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారిని ఎమ్మెల్యే పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. అనంతరం పట్టణ యువకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రెడ్యానాయక్ మాట్లాడారు. రాష్ట్రంలోని యువత అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందంటే సీఎం కేసీఆరే ద్వారానే సాధ్యమన్నారు. డోర్నకల్ నియోజకవర్గంలో యువతకు అనేక విద్యాలయాలను ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి విద్యార్థులు ఇబ్బందులు పడకుండా నియోజకవర్గంలో ప్రతి మండలంలో మోడల్ పాఠశాలలను, సంక్షేమ గురుకులాలు, డిగ్రీ, ఇంటర్ కళాశాలలు నెలకొల్పినట్లు తెలిపారు. విద్యతోనే యువతకు ఉపాధి కోసం అనేక అవకాశాలు ఉంటాయని వివరించారు. యువత క్రీడలపై ఆసక్తి చూపేందుకు పట్టణంలో ఇండోర్ స్టేడియం నిర్మించి క్రీడలను నిర్వహించమన్నారు. ఎన్నికల అనంతరం అవుట్ డోర్ స్టేడియం నిర్మాణం చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రం లోనే డోర్నకల్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో నెంబర్ వన్ గా ఉందన్నారు. రానున్న కాలంలో సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమన్నారు. ఎల్లవేళలా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నానని, అలాంటి తనను మరోమారు ఆశీర్వదించాలని యువతను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు, మరిపెడ మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోతు సింధూర రవి, యువనేత డీఎస్ రవిచంద్ర, మున్సిపల్ వైస్ చైర్మన్ ముదిరెడ్డి బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ గుగులోత్ వెంకన్న, మాజీ ఎంపీటీసీ గంధసిరి అంబరీష, పట్టణ బీఅర్ఎస్ అధ్యక్షుడు వుప్పల నాగేశ్వరరావు, కేసముద్రం మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంట్ల మహిపాల్ రెడ్డి, ఆయుబ్ పాషా, కౌన్సిలర్లు బోడ శ్రీను, ఉరుకొండ శ్రీనివాస్, పానుగోతు వెంకన్న , రేఖ వెంకటేశ్వర్లు, కిషన్, బాలాజీ, ఆఫ్రోజ్, పట్టణ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని ఎల్లయ్యగూడెం (మాధవ నగర్ కాలనీకి) చెందిన 50కుటుంబాలు బీఆర్ఎస్ కు రాజీనామా చేసి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు జినుకుల కనకమల్లు,చిప్ప ఈశ్వర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నర్సంపేట మాజీ శాసనసభ్యుడు కాబోయే ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నూతనంగా పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. గృహలక్ష్మితో ప్రతి మహిళకి ఇంటి యజమానురాలకి 2500 రూపాయలతో ఆర్థిక సాయం అందించే కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ చేపట్టిందన్నారు ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు 5లక్షల రూపాయల ఆర్థిక సాయం ఎస్సీ, ఎస్టీలకు 6లక్షల వరకు అందించే కార్యక్రమాన్ని కూడా కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్నారు. ఈ రాష్ట్రంలో మహిళలకు బస్సు ప్రయాణాన్ని ఉచితంగా అందిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో కాలే పాక కుమారస్వామి, పద్మ, రూపిక వెంకన్న, రజిత, మాసాని ప్రసంగి, రూపిక శ్రీను, అప రంజిని, బాకీ మమత, రాజు, రజిత, సౌరబ్ శ్రీనివాస్, రమేష్, రవీందర్, మమత, స్వామి, రజిత, రామక్రీష్ణ, నాగరాజు, బాలకృష్ణ సమ్మయ్య, కొమురయ్య, సాంబయ్య, బాబు, వేణులతో పాటు మరికొందరు కాంగ్రెస్ లో చేరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్, క్లస్టర్ బాధ్యులు జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్, ఎంపీటీసీ రమా భాయి, మైబు సింగ్ రాథోడ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఆమీరోద్దీన్, చిప్ప లక్ష్మణ్, బాషా బోయిన వెంకటేశ్వర్లు, భాష బోయిన రమేశ్, భిక్షపతి, గంధం బుచ్చి రాములు తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి చేయూత



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** మండలంలోని మగ్దుంపురం గ్రామానికి చెందిన పెండ్యాల అనిల్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అనిల్ తో 10వ తరగతి కలిసి చదువుకున్న తోటి మిత్రులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయంగా రూ.18,500 అందజేశారు. వారు మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గాండ్లరాజేందర్, దేవరాజు, ప్రశాంత్, విజయ్, నరేష్, హుస్సేన్, అఖిల్, అజయ్, రజినీకాంత్, శోభన్ తదితరులు పాల్గన్నారు.

## మేడిగడ్డ బ్యారేజీ దుర్ఘటనపై విచారణ చేపట్టాలి



**వరంగల్ వాయిస్, కాటారం :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లక్ష కోట్లు వెచ్చించి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మాణం చేసిన మేడిగడ్డ ప్రాజెక్ట మేడిపండు చందంగా మారిందని బీఎస్పీ కాటారం మండల అధ్యక్షుడు బొడ్డు రాజబాబు విమర్శించారు. మేడిగడ్డ ప్రాజెక్ట్ ప్రపంచంలోనే పెద్ద ప్రాజెక్టని, లక్షలాది ఎకరాలకు సాగు నీరు, ప్రజలకు తాగునీరందించి తెలంగాణను శ్యాశ్యామలం చేస్తుందని గొప్పలు చెప్పిన మఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర మంత్రులు రామారావు, హరీష్ రావులు కాంట్రాక్ట్ దారుల నుంచి కోట్లాది రూపాయల కమీషన్లు దండుకోని సరైన పర్యవేక్షణ చేయక పోవడంతోనే కాంట్రాక్టర్లు ప్రాజెక్ట్ నిర్మాణంలో నాసిరకం సామాగ్రి వాడి లోపభూయిష్ఠంగా నిర్మించారని అన్నారు. గతంలో వర్షాలకు బాహుబలి మోటార్స్ నీట మునిగి లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందని, అదే విధంగా పలిమేల మండలం ముప్పుకు గురికావడం జరిగింది. ముంపుకు గురై రెండు వందల అరువై ఒక్క గొర్రెలు కొట్టుకుపోవడం జరిగిందన్నారు. బ్యాక్ వాటర్ ద్వారా పంటలు దెబ్బతిన రైతులకు నష్టం వాటిల్లుతుందని, నష్ట పోయిన రైతులకు నష్ట పరిహారం అందించలేని పక్షంలో ధర్నాలు చేస్తామని డిమాండ్ చేశారు. మూడు రోజుల క్రితం ఇరవైవ నంబర్ పిల్లర్ వంతెన కృంగి పోవడంతో వంతెన భవిష్యత్ ప్రశ్నర్ధకంగా మారిందని రాజబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజి వంతెన కుంగుబాటుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ నైతిక బాధ్యత వహించాలని బహుజన్ సమాజ్ పార్టీ కాటారం మండల శాఖ తరుపున బొడ్డు రాజబాబు డిమాండ్ చేశారు.



## ఎప్పటికీ మరిచిపోను



చెడుపై మంచి గెలిచిన ప్రతీకగా దసరా ఉత్సవాల్లో రావణ దహనం చేస్తుంటారు. ప్రతి సంవత్సరం ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. ప్రధాన మంత్రి చేతులమీదుగా ఈ తంతు జరుగుతుంటుంది. అయితే ఈ ఏడాది బాలీవుడ్ నటి కంగనా రనౌత్ ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. 50 ఏళ్ల చరిత్రలో ఓ మహిళ సెలబ్రిటీ ఈ కార్యక్రమానికి వెళ్లి రావణ దహనం చేయడం ఇదే మొదటిసారి. మంగళవారం సాయంత్రం ఈ రావణ దహనం జరగనుంది.తాజాగా మహిళా బిల్లును పార్లమెంట్ ఆమోదించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ సారి రావణ్ దహన్ కార్యక్రమానికి రామ్‌లీల కమిటీ కంగనాను ఆహ్వానించింది. ఆమెతో పాటు మరికొందరు సెలబ్రిటీలు కూడా ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ కంగనా ఓ ప్రత్యేక వీడియో విడుదల చేసింది. '50 ఏళ్ల నుంచి వేడుక జరుగుతుంది. కానీ, రావణ్ దహన్ వేడుకను ఓ మహిళ చేయడం ఇదే మొదటిసారి. ఆ అవకాశం నాకు లభించడం ఎంతో సంతోషంగా ఉంది' అని చెప్పారు. తాజాగా ఆమె నటించిన తేజస్ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. కంగనా రనౌత్ ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి సర్వేశ్ మేవారా దర్శకత్వం వహించారు. 2016లో భారత వైమానిక దళం క్షేత్రస్థాయి పోరాటా విధానాల్లోకి మొట్టమొదటిసారిగా మహిళలకు ప్రవేశాన్ని కల్పించిన సంఘటన ఆధారంగా ఈ సినిమా రూపొందింది. రోనీ స్క్రూవాలా ఈ చిత్రాన్ని నిర్మించారు.



## చిరు 156 కోసం
## 'విశ్వంభర' టైటిల్..?

మెగాస్టార్ చిరంజీవి దసరా సందర్భంగా తన 156వ చిత్రానికి కొబ్బరికాయ కొట్టారు. బింబిసార ఫేం వశిష్ట దర్శకత్వంలో ఈ సినిమాని యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఎం.ఎం.కీరవాణి సంగీతమందిస్తున్నారు. ఫాంటసీ అడ్వెంచర్ జోనర్ లో రూపొందనున్న ఈ చిత్రానికి ఓ ఆసక్తికరమైన టైటిల్‌ని పరిశీలిస్తున్నారని తెలుస్తుంది. ప్రముఖ సాహితీవేత్త, కవి, రచయిత, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డా.సి.నారాయణరెడ్డి రచించిన పద్య కావ్యము 'విశ్వంభర'. ఈ గ్రంథానికి 1988 సంవత్సరంలో భారతదేశంలోని అత్యున్నతమైన జ్ఞానపీఠ పురస్కారం వరించింది. ఇప్పుడు మెగాస్టార్ 156 చిత్రానికి కూడా 'విశ్వంభర' అనే పేరుని పరిశీలిస్తున్నారని టాలీవుడ్‌లో టాక్ నడుస్తుంది. ఇక 'విశ్వంభర' అంటే.. భూమి, విశ్వమును పాలించువాడు, ఇంద్రుడు, విష్ణువు అనే అర్థాలు వున్నాయి. ఈ సినిమా కథ కూడా ముల్లోకాల నేపథ్యంలో వుంటుందని.. అందుకే ఈ టైటిల్ సరిగ్గా సరిపోతుందని యూనిట్ భావిస్తోందని తెలుస్తుంది. కాగా.. త్వరలోనే ఈ మూవీ టైటిల్‌పై అధికారిక ప్రకటన చేయనున్నారు మేకర్స్.



## అందుకే సినిమాలకు
## ఆరునెలలు బ్రేక్

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్ కపూర్ సినిమాలకు కాస్త విరామం ప్రకటించారు. ఇటీవలే సోషల్ మీడియాలో ఫ్యాన్స్‌తో చిట్‌చాట్ నిర్వహించిన రణ్‌బీర్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఓ ఆరు నెలల పాటు సినిమాలకు బ్రేక్ ఇస్తున్నట్లు తెలిపారు. 'యానిమల్' తర్వాత ఏ చిత్రానికి సైన్ చేయలేదని వెల్లడించారు. తన కూతురు రాహాతో సమయాన్ని గడపాలనుకుంటున్నానని.. అందుకే సినిమాలకు కాస్త బ్రేక్ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా రణ్‌బీర్ మాట్లాడుతూ "యానిమల్' తర్వాత నేను మరే ఇతర చిత్రానికీ కమిట్ కాలేదు. కొన్ని రోజులు నా కూతురు రాహాతో గడపాలనుకుంటున్నా. నా బిజీ షెడ్యూల్ కారణంగా రాహా పుట్టిన తర్వాత తొలి నెలల్లో తనతో ఎక్కువ సేపు టైమ్ స్పెండ్ చేయలేకపోయాను. అందుకే, ఇప్పుడు లాంగ్ బ్రేక్ తీసుకుని 6 నెలల పాటు ఇంట్లోనే ఉంటూ తనతో సమయాన్ని గడపాలనుకుంటున్నా' అని వెల్లడించారు. ఇదే సమయంలో కుమార్తె రాహా గురించి రణ్‌బీర్ మాట్లాడుతూ 'రాహా ఇప్పుడే ఇళ్లంతా తిరుగుతూ.. అన్నింటినీ గుర్తిస్తోంది. ప్రేమను వ్యక్తపరుస్తోంది. అమ్మ, నాన్న వంటి పదాలను పలికేందుకు ప్రయత్నిస్తోంది. తండ్రిగా ఈ అందమైన క్షణాలను ఆస్వాదించాలనుకుంటున్నా. ఈ ఆరు నెలలు పూర్తిగా తనతోనే గడుపుతా' అంటూ చెప్పుకొచ్చారు. అర్జున్ రెడ్డి ఫేమ్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్ హీరోగా నటించిన చిత్రం యానిమల్. ఈ చిత్రంలో రణ్‌బీర్‌కు జోడీగా నేషనల్ క్రష్ రష్మిక నటిస్తోంది. గీతాంజలిగా ఆమె ఈ చిత్రంలో కనిపించనుంది. ఇందులో బల్బీర్ సింగ్‌గా అనిల్ కపూర్ నటిస్తున్నారు. ఈ సినిమా డిసెంబర్ 1న విడుదల కానుంది.



## డంకీతో షారూఖ్
## హ్యాట్రిక్ సాధిస్తాడా..?

ఈ ఏడాది మోస్ట్ సక్సెస్‌ఫుల్ హీరో ఎవరంటే టక్కున గుర్తొచ్చే పేరు బాలీవుడ్ బాద్‌షా షారుఖ్‌ఖాన్. పఠాన్, 'జవాన్' సినిమాలతో ఈ సంవత్సరం బ్యాక్ టూ బ్యాక్ హిట్లు అందుకున్నాడు. జనవరిలో వచ్చిన పఠాన్ సినిమా రూ.1000 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించగా.. రీసెంట్‌గా విడుదలైన 'జవాన్' సినిమా వరల్డ్ వైడ్‌గా రూ.1140 కోట్లు కొల్లగొట్టింది. ఇక ఈ చిత్రంలో షారుఖ్ నటనకు ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు. ఇదిలా ఉంటే షారుఖ్‌ఖాన్ తాజాగా నటిస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ 'డంకీ'. మున్నాభాయ్ ఎం.బీ.బీ.ఎస్. లాగేరహో మున్నాభాయ్, త్రీ ఇడియట్స్ (3), పీకే, సంజు వంటి బ్లాక్ బస్టర్ చిత్రాల తీసిన రాజ్‌కుమార్ హిరానీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. తాప్సీ కథనాయికగా నటిస్తుంది. డిసెంబర్ 22న ఈ సినిమా విడుదల కానుండగా.. మూవీ నుంచి ఇప్పటివరకు ఒక్క అప్‌డేట్ రాకపోవడం విశేషం. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ సినిమాపై బాలీవుడ్ సీనియర్ నటుడు బోమన్ ఇరానీ స్పందించాడు.దసరా పండుగా సందర్భంగా సినీ టీవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ముంబైలోని తమ కొత్త ఆఫీస్‌ను మంగళవారం ఘనంగా ప్రారంభించింది. ఇక ఈ వేడుకలో బోమన్ ఇరానీ ముఖ్య అతిథిగా హాజరయ్యాడు. వేడుక అనంతరం షారూఖ్ ఖాన్ డంకీ సినిమా గురించి మాట్లాడుతూ షారుఖ్‌కి ??ఇది వరుసగా మూడో బ్లక్ బస్టర్ (హ్యాట్రిక్) అవుతుందని అన్నారు. అలాగే డంకీ కామెడీతో పాటు మిమ్మల్ని ఆలోచింపజేస్తుంది. మీరు దీన్ని ఎంజాయ్ చేస్తారు.. అంటూ బోమన్ తెలిపారు. కాగా ప్రస్తుతం ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. దీపావళి కానుకగా షారుఖ్ డంకీ సినిమా టీజర్‌ను విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని టాక్. దీపావళికి విడుదల కానున్న సల్మాన్ ఖాన్ టైగర్ జిందా హై 3 (టైగర్ త్రీ)తో పాటు డంకీ టీజర్‌ను మేకర్స్ విడుదల చేయనున్నట్లు సమాచారం. ఒకవేళ అదే నిజమైతే అటు షారుఖ్ ఫ్యాన్స్‌తో పాటు ఇటు సల్మాన్ ఫ్యాన్స్‌కు పండగ అనే చెప్పుకోవాలి. కాగా దీనిపై అధికారిక సమాచారం కొరకు మరింత సమయం వేచి చూడాల్సి ఉంది.

# ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలి

## సీపీ అంబర్ కిషోర్ ఝా

## వివిధ పోలీస్ స్టేషన్లలో ఆకస్మిక తనిఖీ



**వరంగల్ వాయిస్, క్రైం :** వరంగల్ పోలీస్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన అనంతరం సీపీ అంబర్ కిషోర్ ఝా తొలిసారిగా హసన్ పర్తి, కమలాపూర్, ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్లను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను ఆయన పరిశీలించారు. అధికారులు, సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో పోలీసులు కీలకంగా నిలవాలని కోరారు. అలాగే ఎన్నికల్లో తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకునేలా ప్రజల్లో మనోధైర్యాన్ని పెంపొందించాలన్నారు. ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు చెపట్టాల్సిన చర్యలపై పోలీస్ అధికారులు, సిబ్బందికి ఆయన సూచించారు. ఈ తనిఖీల్లో కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజు, ఇన్స్పెక్టర్ గోపి, సంజీవ్, ప్రవీణ్ కుమార్ తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల నిబంధనలు పాటించాలి

## అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

## వరంగల్ తూర్పు ఆర్ఓ, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ భాషా

## ఎన్నికల వ్యయ పరిశీలక బృందాలతో సమన్వయ సమావేశం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని వరంగల్ తూర్పు ఆర్ ఓ, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ భాషా ఆదేశించారు. బుధవారం జీడబ్ల్యూఎంసీ కౌన్సిల్ హాల్ లో పోలీస్ అధికారులు, ఏఆర్ఓలతో కలసి వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఎఫ్ ఎస్ టీ, ఎస్ ఎస్ టీ, వీవీటీ, ఎన్నికల వ్యయ పరిశీలక బృందాలతో జరిగిన సమన్వయ సమావేశంలో ఎన్నికల నియామావళికి లోబడి సమర్ధవంతంగా విధుల నిర్వహణకు పలు సూచనలు చేశారు. సి-విజిల్, సువిధ తదితర అంశాలపై నియోజక వర్గాల వారిగా సమీక్షించి సమర్ధ నిర్వహణకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ తూర్పు నియోజకవర్గంలో నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను 24 గంటలు విధులు నిర్వర్తించేలా షిఫ్ట్ ల వారీగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో ఎన్నికల సమయంలో అక్రమంగా డబ్బు, మద్యం పంపిణీ చేసి ఓటర్లను ప్రలోభ పెట్టే అవకాశం ఉందని, దీనిని నివారించేందుకు డబ్బు మద్యం తరలింపుపై గట్టి నిఘా ఉంచామని, నగరంలో ప్రవేశించే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. నగరంలోకి ప్రవేశించే మార్గాలైన జాన్ పీర్ల వద్ద, ఖమ్మం రోడ్డు నాయుడు పెట్రోల్ పంప్ వద్ద, ఎంజీఎం సర్కిల్ అన్ లిమిటెడ్ వద్ద మొత్తం మూడు చెక్ పోస్టులను ఏర్పాటు చేసి ఎస్ ఎస్ టీ బృందాల ద్వారా డబ్బు, మద్యం తదితరాలు అక్రమంగా తరలించకుండా గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ లకు వాహనాలతోపాటు సీసీటీవీ కెమెరా మౌంటెడ్ వాహనాలను కేటాయించామన్నారు. ఎక్కువ మొత్తంలో నగదు దొరికితే సీజ్ చేసి జిల్లా గ్రీవెన్స్ సెల్ వద్ద జమ చేయాలని, రూ.10 లక్షల పైబడి డబ్బు సీజ్ చేసినచో ఆదాయ పన్ను శాఖ వద్ద జమ చేయాలన్నారు. సువిధ ద్వారా ఎప్పటికప్పుడు అనుమతులు మంజూరు చేయాలన్నారు.

సి-విజిల్ కు వచ్చే ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనల ఫిర్యాదులపై త్వరితంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈఎస్ ఎం ఎస్ ఆప్ లో సీజ్ చేసిన వివరాలు ఎప్పటికపుడు నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏసీపీ బోనాల కిషన్, సిటీ ప్లానర్ వెంకన్న, ఉప కమిషనర్లు కృష్ణారెడ్డి, రవీందర్, ఏఈఆర్వోలు, ఎస్ ఎస్ టీ, ఎఫ్ ఎస్ టీ, వీసీటీ, ఎక్స్ పెండీచర్ మానిటరింగ్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

# ఇంటర్నేషనల్ డిప్లొమా అందుకున్న నాగరాజు, నవ్యశ్రీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఇంటర్నేషనల్ కుష్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రెజా సస్పిరి, వరల్డ్ చాంపియన్, కోచింగ్ ఎక్స్పర్ట్, ఒలిమ్ కోచింగ్ ఇవ్వగా ఇందులో తెలంగాణ రాష్ట్రం నుంచి చందనగిరి నాగరాజు, చందనగిరి నవ్యశ్రీ అత్యధిక ప్రతిభ కనబర్చి డిప్లొమా సర్టిఫికెట్లను కైవసం చేసుకున్నారు. ఇంటర్నేషనల్ స్టార్ రిఫరీ, ఇంటర్నేషనల్ కోచ్ గా నాగరాజు, ఇంటర్నేషనల్ కోచ్, నేషనల్ రిఫరీగా నవ్యశ్రీ ఇంటర్నేషనల్ కురేష్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ రెజు సస్పిరి చేతుల మీదుగా డిప్లొమా సర్టిఫికెట్లు అందుకున్నారు. తెలంగాణాలోనే డిప్లొమా సర్టిఫికెట్ అందుకున్న మొట్టమొదటి మహిళగా నవ్యశ్రీ రికార్డు సృష్టించారు. ఇంటర్నేషనల్ కురాష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిఫరీ సెమినార్, కోచెన్ కోర్స్, ఎగ్జామినేషన్, ఉత్తరప్రదేశ్ సహరాన్పూర్ లోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ స్టేడియంలో ఈ నెల 19 నుంచి 22 వరకు సెమినార్ నిర్వహించగా వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు, కోచులు పాల్గొన్నారు. కురాష్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ రాజన్ వర్గీస్, జనరల్ సెక్రెటరి విక్రాంత్ కుమార్, కురాష్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రెసిడెంట్ నాయినేని సంపత్ రావు, కార్యవర్గ సభ్యులు సముద్రాల మొగిలి, శ్రీకర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, గంజి రమేష్, వీరిద్దరికి అభినందనలు తెలిపారు. త్వరలోనే మన తెలంగాణాలో కూడా సెమినార్ నిర్వహించబోతున్నట్లు తెలంగాణ కురాష్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరి చంద్రగిరి నాగరాజు ప్రకటించారు.

# గ్రీవెన్స్ కమిటీ ద్వారా కేసుల పరిష్కారం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువులను తిరిగి అప్పగించాలంటే తగిన ఆధారాలు చూపించాలని, గ్రీవెన్స్ కమిటీలో త్వరితగతిన ఆ కేసుల పరిష్కారం ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్త పట్నాయక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో గ్రీవెన్స్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రూ.50వేలకు మించి రూ.10లక్షలకు లోపు నగదు, బంగారం, వెండి, ఇతర వస్తువులకు సంబంధించి ఆధారాలను కలెక్టరేట్ లోని 2వ అంతస్తు రూమ్ నంబర్ ఎస్-21 గల గ్రీవెన్స్ కమిటీకి ఆప్పీల్ చేస్తే వాటిని పరిశీలించి వెంటేనే విడుదల చేస్తుందన్నారు. రూ.10లక్షల కన్నా మించిన వాటికి సంబంధించిన నగదును, బంగారం, వెండి, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్న కేసుల్లో ఆదాయ పన్ను, వాణిజ్య పన్నుల శాఖలకు సమాచారం అందించిన తర్వాత వారి నుంచి క్లియరెన్స్ రాగానే గ్రీవెన్స్ కమిటీ విడుదల చేస్తుందని చెప్పారు. పోలీసు అధికారులు స్వాధీనం పరుచుకున్న సొమ్ముకు కచ్చితంగా రశీదు అందించడంతో పాటు గ్రీవెన్స్ సెల్ కి ఎండార్స్ చెయ్యాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, పీడీ డీఆర్ డీఓ శ్రీనివాస్ కుమార్, డీసీఓ జి.నాగేశ్వర రావు, డీటీఓ జి.రాజు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే పేదింటి కల సాకారం

## మాజీ మంత్రి కొండా సురేఖ

## నగరంలోని 36వ డివిజన్‌లో విస్తృత పర్యటన



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ఇందిరమ్మ రాజ్యం వస్తేనే పేదింటి కల సాకారం అవుతుందని మాజీ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని గడపగడపకు సురేఖమ్మ కార్యక్రమంలో భాగంగా బుధవారం 36వ డివిజన్ లోని చంద్రవదన్ కాలనీ, జేబీ నగర్, ఆర్ ఎస్ నగర్, రామాలయం టెంపుల్ ఏరియా, చింతల్, పుప్పాల గుట్ట, శివనగర్ ప్రాంతాల్లో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీతో కలిసి పర్యటించారు. గడపగడపకు తిరుగుతూ ప్రజలకు సోనియాగాంధీ ప్రకటంచిన ఆరు గ్యారంటీ పథకాలను వివరించారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ గతంలో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులు అంతేగాని ఇప్పుడు ఉన్న ఎమ్మెల్యేకు అభివృద్ధి చేయడంలో పట్టింపు లేదని ఆరోపించారు. కేవలం కమీషన్ల మీద ఉన్న శ్రద్ధ వరంగల్ తూర్పు ప్రజలపై లేదన్నారు. తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధిని గాలికి వదిలేసి కేవలం తన ఆస్తులను పెంచుకోవడం పైనే దృష్టి అంతా ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ జోరులో ఉందని అధికారంలోకి రావడం ఖాయమైందన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధిని పక్కదోవ పట్టించి ప్రజలకు మాయ మాటలు చెప్పి ప్రలోభాలకు గురి చేస్తున్నారన్నారు. ప్రజలు బీఆర్ఎస్ చేస్తున్నటువంటి అరాచకాలను నిశితంగా గమనిస్తున్నారని, ఆ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధమవుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో గెలిచేది కాంగ్రెస్ పార్టీయే అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కొరకు ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై అహర్నిశలు శ్రమించాలని పిలుపు నిచ్చారు. మీరంతా ఉత్సాహంతో గతంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టినటువంటి పథకాలను ఇప్పుడు అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేసి కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషి చేయాలని సూచించారు. అధికార పార్టీ వాళ్లు చెప్పే దొంగ మాటలకు మోసాపోకుండ జాగ్రత్తగా ఉండాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కొండా సురేఖ కోరారు. ప్రతి ఒక్కరికి కొండా దంపతులు ఎల్లవేళలా అండగా ఉంటారన్నారు. ఎలాంటి ఆపద సమయాల్లోనైనా మీకు తోడుగా ఉంటామని మీరే మా కుటుంబమని, కార్యకర్తలే మా కుటుంబ సభ్యులు అని కొండా మురళీధర్ రావు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వరంగల్ తూర్పు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, అన్ని డివిజన్ల అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కొండా అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com